

3 రోజులూ భీమవరంలోనే..

నియోజకవర్గాల వారీగా సమీక్షకు పవన్ సిద్ధం

నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలు, ఇప్పటి వరకు ప్రజల పక్షాన నిలిచి పోరాడిన అంశాలు, గత ఎన్నికల్లో లభించిన ఓట్లు, శాతం మొదలైన అంశాలపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఒక అంచనాకు రానున్నారు. క్షేత్రస్థాయిలో నియోజకవర్గ ముఖ్యులు, కేడర్ తో భేటీ అయ్యి మరింత సమాచారం రాబట్టేం దుకు సిద్ధపడుతున్నారు. ఈ మేరకు భీమవరంలో మూడు రోజులు పవన్ సమీక్షకు దిగబోతు న్నారు. భేటీ తేదీలు, సమయం ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది.

- ఈ వారాంతంలోనే భేటీకి అనుకూల సంకేతాలు
- భీమవరం స్థానంపైన లోతైన కసరత్తుకు రెడీ
- ప్రభుత్వ వ్యతిరేకత, జనం నాడిపైనే ప్రత్యేక దృష్టి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

తెలుగుదేశం చేపట్టిన బహిరంగ సభలకు పవన్ హాజరవు తారని చెబుతుండగా తమ పార్టీ విషయంలో ఆయన మరింత శ్రద్ధ పెట్టి ఎక్కువ సమయం కేటాయించబోతున్నా రు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రాజకీయ స్థితిగతులు, ఎత్తులు, పైఎత్తులు, సామాజిక వర్గాలుగా అంచనాలు, ఓట్ల చీలికలు, అనుకూలత, వ్యతిరేకత వంటి అంశాలన్నింటిపైనా సీనియర్లతో ఒక దఫా సమీక్షించారు. ముఖాముఖి భేటీ అయి తేనే మరింత సానుకూలత, స్పష్టత ఉంటుందని భావించి మూడు రోజులు భీమవరంలో భేటీకి వీలుగా సంకేతాలు ఇచ్చారు. కొన్నాళ్లుగా నియోజకవర్గాల్లో జన సైనికులు ఉమ్మడి గా పార్టీ కార్యక్రమాలను ఉధృతం చేశారు. టీడీపీతో ఎన్నికల పొత్తు ప్రకటన ముందుగానే వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొందరు చురుగ్గా వ్యవహరించడం ప్రారం భించారు. వాస్తవానికి జనసేన ఆది నుంచి నియోజక వర్గాల వారీగా దృష్టి పెట్టినా ఇప్పటి వరకు కొన్ని నియోజకవర్గాల్లో కన్వీనర్ల నియామకం పూర్తి చేయలేకపోయారు. ఉమ్మడి పశ్చిమలోని 15 అసెంబ్లీ నియో జకవర్గాల్లో కేవలం సగానికి మాత్రమే నియోజకవర్గ బాధ్యతల ను అప్పగించారు. స్థానిక పరిస్థితులు అనుకూలించక కొన్నిచోట్ల, నియోజకవర్గ భారం మొత్తం మోసే బాధ్యత తీసుకోలేని పరిస్థితుల్లో కన్వీనర్ల నియామకం పూర్తి చేయలేదు. మూడు నెలలుగా పార్టీలో ఎన్నికల వేడి పెరిగింది. ఆ దిశగానే నియో జకవర్గ బాధ్యతలు మోసేందుకు అక్కడక్కడ నేతలు ముం దుకు వస్తున్నారు. టీడీపీతో పొత్తు కుదిరిన సందర్భంలో నియోజకవర్గాల వారీగా రెండు పార్టీల మధ్య సమన్వయ సాధనకు కన్వీనర్ల నియామకం తప్పని సరైంది. ఉన్న కొన్ని నియోజకవర్గాల్లో కన్వీనర్లే అంతా తామై పార్టీని నడిపిస్తు న్నారు. ఆది నుంచి జనసేనపై ఆదరణ పెంచుకుని తమకు తాముగా కార్యక్రమాలను వేగిరపరుస్తూ వచ్చారు. కీలక నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా అనువైన వాతావరణం సృష్టించుకోగలిగింది.

> నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమన్వయం కోసం టీడీపీ, జనసేన భేటీలు కొనసాగు తూనే ఉన్నాయి. సగానికి సగం నియోజక వర్గాల్లో ఈ వ్యవహారం దాదాపు పూర్తయ్యింది. పరస్పరం సహకరించుకుం టామని, వైసీపీని ఓడిస్తామని ఇరు పార్టీల నేతలు ఉమ్మడి సమావేశాల్లో ప్రకటిస్తూనే ఎన్నికలకు సిద్ధమంటూ కీలక ప్రకటనలు చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ జిల్లాకు రానుండడం అదీ పార్టీ కేడర్‌తో ముఖాముఖి భేటీ కావాలని నిర్ణయించడాన్ని ఆ పార్టీలో ఉన్న వారంతా స్వాగతిస్తున్నారు.

పవన్ ఏం చేయబోతున్నారు..?

తాను పోటీ చేయాలనుకుంటున్న భీమవరంలోను మరింత పటిష్టంగా కేడర్ ముందడుగు వేసేలా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రత్యేక వ్యూహం రూపొందించుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఎదురైన ఓటమి నుంచి నేర్చుకున్న పాఠాలు, అనుభవాలతో ఈసారి ఆచితూచి అడుగులు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు చినబాబు భీమవరం కేంద్రంగా పార్టీ వ్యవహారాలను నడిపిస్తున్నారు. పార్టీ ఎలా వ్యవహరించాలి, ఏ ఏ వర్గాలను పూర్తిగా తమ వైపు తిప్పుకోవాలి, బూత్ స్థాయిలో వున్న పరిస్థితులు ఏమిటి ? భీమవరం మునిసిపాలిటీ పరిధిలోని వార్డుల వారీగా ఉన్న టీడీపీ, జనసేన బలగాల అంచనాలపై పవన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. భీమవరం నుంచి రెండోసారి పవన్ పోటీ చేయబో తున్నారన్న సంకేతాలు బయటకు వెలువడిన వెంటనే సీఎం జగన్ ఆ దిశగానే బాణాలు ఎక్కుపెట్టారు. ఈ మధ్యనే భీమవరం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితంపై ఎక్కువ సమయం కేటాయించి మరీ మాట్లాడారు. జనసేన-టీడీపీ పొత్తును ప్రస్తావిస్తూ పవన్‌ను తక్కువ చేసే విధంగా వ్యాఖ్యలు చేశారు. కాపు సామాజిక వర్గం పూర్తిగా పవన్ వైపు మొగ్గకుండా తమవైపు నుంచి ఆ దిశగా కదలకుండా ఉండేందుకే సీఎం ఆ విధంగా మాటల తూటాలు విసిరినట్టు చెబుతున్నారు. కొన్నిగంటల వ్యవధిలోనే జనసేన జిల్లా నాయకత్వం స్పందించి సీఎం మాటలపై ఎదురుదాడి చేశారు.

మరోవైపు ఉమ్మడి జిల్లాల నుంచి ఆశించే అసెంబ్లీ స్థానాల పైనా ప్రత్యేక దృష్టి పెట్టబోతు న్నారు. పొత్తుకు సంబంధించి సీట్ల వ్యవహారం ఆసాంతం పూర్తి కాలేదు కాబట్టి నియోజక వర్గాలపై పట్టు బిగించాలని కేడర్‌కు పవన్ దిశ నిర్దేశం చేయబోతున్నారు. గోదావరి జిల్లాల్లో పార్టీకి వున్న ఇమేజ్‌ను, బలగాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ సీనియర్లతో అప్పుడప్పుడు నాదెండ్ల మనోహర్ సంభాషిస్తున్నారు. స్థానిక పరిస్థితులు, అనుకూలత, వ్యతిరేకతపైన నివేదికలు రప్పించి పార్టీ అధ్యక్షుడికి అందజేస్తున్నారు. ఈసారి భేటీ అయ్యే నేతలు, కార్యకర్తలతో లోతట్టుగా కొనసాగిస్తారు. దీనికోసమే మూడు రోజులపాటు భీమవరంలోనే ఉండడమే కాకుండా కేడర్‌లోని అభిప్రాయాలను ఆయన తెలుసుకునే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే ఆయన కాకినాడలో పర్యటించాల్సి ఉన్నా కొంత జాప్యం కారణంగా ఆయన భీమవరానికి ఎప్పుడు వస్తారనేది ఇంకా బహిర్గతం కాలేదు. ఆదివారం తర్వాతే పవన్ షెడ్యూల్ ఖరారవుతుందని భావిస్తున్నారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నినాదాలు

పిడికిలి బిగించి..



అంగన్‌వాడీల ఆందోళన

- భీమవరం, ఏలూరు కలెక్టరేట్ల ధర్నాలు.. భారీగా హాజరు
- ముందస్తు అరెస్టులతో పలుచోట్ల పోలీసుల అడ్డగింత
- భీమవరంలో ఉద్రిక్తత.. పలువురి అరెస్ట్

ఏలూరు కలెక్టరేట్/ భీమవరం అర్బన్/భీమవరం క్రైం/, జనవరి 3 : అంగన్‌వాడీలు పిడికిళ్లు బిగించారు. ప్రభుత్వంతో అమీతుమీకి సిద్ధమయ్యారు. అరెస్టులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. భీమవరం మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చి బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులు అడ్డుకోవ డం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. 23 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు భీమవరంలో బుధవారం నిరసన సభ నిర్వహించారు. సభకు అనుమతి తీసుకున్నప్పటికీ తెల్లవారుజాము నుంచి సీఐటీ యూ నాయకులు, అంగన్‌వాడీ నాయకులను మొత్తం 150 మందిని అదుపులోకి తీసుకుని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు, అక్కడి నుంచి జిల్లా రైస్ మిల్లర్స్ భవనానికి తరలించారు. విషయం తెలుసుకున్న మిగిలిన సిబ్బంది, నాయకులు ర్యాలీ గా ప్రకాశంచౌక్ చేరుకుని బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. కొన్ని వాహనాలు నిలిచిపోయా యి. భీమవరం డీఎస్పీ శ్రీనాథ్, సీఐలు జి.శ్రీనివాస్, సత్యనా రాయణ సిబ్బంది కలిసి సీఐటీయూ నాయకులు వాసుదేవరా వును, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెక్కంశెట్టి



భీమవరంలో నాయకుల అరెస్టు

సత్యనారాయణలను బలవంతంగా ఆటోలో స్టేషన్‌కు తరలిం చారు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది నినాదాలు చేశారు. అదు పులోకి తీసుకున్న నాయకులను వెంటనే వదిలి పెట్టాలని డిమాండ్ చేశారు. సీఎంతోపాటు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ప్రకాశం చౌక్ హోరెత్తింది. ఇక్కడి నుంచి లేవాలంటే ముందు అరెస్టు చేసిన నాయకులను విడు దల చేయాలని అంగన్‌వాడీలు స్పష్టం చేయడంతో పోలీసు లు వారిని విడుదల చేసి మునిసిపల్ ఆఫీసు వరకు ఊరేగిం పుగా వెళ్లి, సభ జరుపుకోవడానికి అనుమతి ఇచ్చారు.

సభకు అనుమతులిచ్చి అరెస్టులా ?

ప్రభుత్వం అబద్దపు మాటలతో అంగన్‌వాడీలను మోస గించిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారా మ్మోహన్‌రాయ్ విమర్శించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలు విధుల్లో చేరకపోతే తొలగిస్తామని అధికారులు బెదిరింపులకు దిగడం సరికాదని విమర్శించారు. సభ జరుపుకోవడానికి పోలీసులు అనుమతులు ఇచ్చి అరెస్టు చేయడం దారుణమ న్నారు. యుటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపి మూర్తి, వివిధ సంఘాల నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, కేవీపీఎస్‌కే క్రాంతిబాబు, సరోజిని, ఎం.రామాంజనేయులు ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు.

ఏలూరు కలెక్టరేట్ వద్ద మహాధర్నా

ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి నిరసిస్తూ ఏలూరులో బుధవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు గర్జించారు. భారీ ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ వద్ద కదం తొక్కారు. న్యాయమైన డిమాండ్లు పరి ష్కరించాలని కోరుతూ 23 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ వందలాది మంది ఏలూరు జూట్‌మిల్లు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కనీస వేతనం అమలుచేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని నినాదాలు చేశారు. కలెక్టరేట్ వద్ద బైఠా యించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్న జగన్ మొద్దునిద్ర నటిస్తున్నారని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఏఐటీ యూసీ నాయకులు కె.బుచ్చిబాబు మాట్లాడారు. పోలీసుల అక్రమ అరెస్టులకు నిరసనగా అంగన్‌వాడీలు కుక్కు నూరు లో ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మె విర మించి ఐదో తేదీలోగా విధులకు హాజరు కావాలని, శాఖా పరమైన చర్యలు తీసుకునే ఆలోచన చేయకుండా వ్యవహ రించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఓ ప్రకటనలో కోరారు.

యూటీఎఫ్ 12 గంటల ధర్నా

ఏలూరు కలెక్టరేట్, జనవరి 3: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపా ధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉపా ధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ఒకటో తేదీన జీతా లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద 12 గంటల ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీ అధ్యక్ష తన జరిగిన కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి రామారావు పాల్గొని ధర్నా శిబిరాన్ని ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ పాద యాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా జగన్ ప్రభుత్వం మాటతప్పి మడమ తిప్పిందన్నారు. అధికారం లోకి వచ్చిన తర్వాత ఒక్క డీఏ కూడా ఇవ్వకపోగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్లు బకాయి పడింద



ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

న్నారు. రాష్ట్ర కార్యదర్శి డి.సుభాషిణి మాట్లాడుతూ పెండిం గ్ బకాయిలు చెల్లించని పక్షంలో ఈ నెల 9, 10 తేదీల్లో 36 గంటల ధర్నా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు పి.వి నరసింహారావు, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.వి శ్యామ్‌బాబు, కనకదుర్గ, వెంకటేశ్వరరావు, రంగమో హన్, సాగర్ బాబు, వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12 వరకు ఓటు అభ్యర్థనల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు సిటీ, జనవరి 3 : భారత ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా విడుదల గడువు పొడిగించినందున జనవరి 12వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు క్లయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధిం చిన అర్జీలను స్వీకరించనున్నట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. జిల్లాలో స్వచ్ఛమైన, స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. స్పెషల్ సమ్మర్ రివిజన్-2024 ఇతర ఎన్నికల అంశాలపై రాజకీయ పక్షాల ప్రతినిధులతో బుధవారం కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 తుది జాబితా జనవరి 5వ తేదీకి బదులుగా జనవరి 22న విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. జనవరి 12వ తేదీ వరకు ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ చేపట్టాలన్నారు. డిసెంబరు 9 తర్వాత అందిన ప్రతి క్లయిమ్‌ను నిర్దిత గడువులో పరిష్కరిం చాలన్నారు. సుమారు 25 వేల మంది యువత అక్టోబరు 27వ తేదీ నాటికి ఓటుహక్కుకు నమోదు చేసుకున్నార న్నారు. జిల్లాలో 2024 జనవరి 2వతేదీ నాటికి 16,23,530 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. జిల్లాలో ఇంతవరకు 7,787 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటిలో ఫారం-6 కింద 2028, ఫారం-7 కింద 3086, ఫారం-8 కింద 2673 దరఖాస్తులు ఉన్నాయ న్నారు. ఇవి అన్నీ కూడా డిసెంబరు 9వ తేదీ తర్వాత వచ్చినవే అన్నారు. జాబితాలో మరణించిన వారు, డూప్లికేట్ పేర్లను తొలగిం చడంతో పాటు అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని జాబితాలో పొందు పరిచామన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, రాజకీయ పక్షాల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

బుట్టాయగూడెం, జనవరి 3 : పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో ఏలేరుపాడు ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవిరెడ్డి పీవో ఎం.సూర్యతేజకు వినతిపత్రం అందజేశారు. ఏలేరుపాడు మండలం కటుకూరుకు చెందిన గిరిజనులకు కొంతమందికి జీలుగుమిల్లి మండలం రౌతుగూడెంలో పునరవాస కాలనీలు ఏర్పాటు చేశారని కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారని, చాలామందికి ఇంకా ఇళ్లు ఇవ్వనం దున అందరికీ మంజూరు చేయాలని పీవోకు విజ్ఞప్తి చేశారు. పీవోను కలిసినవారిలో కెచ్చెల గంగిరెడ్డి, గురుగుంట్ల ఇంద్ర ఉన్నారు. ఎంపీపీ ఫిర్యాదుపై స్పందించిన పీవో సమస్యలు పరిష్కారిస్తామని తెలిపారు. పలువురు నిర్వాసిత గిరిజనులు పరిహారం అందలేదని విన్నవించారు. గిరిజన గ్రామాల్లో త్వరితగతిన ప్రతి ఇంటికి ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నట్టు పీవో తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



ఏలూరు క్రైం, జనవరి 3 : సంక్రాంతి పురస్కరించుకుని సౌత్ సెంట్రల్ రైల్వే వివిధ ప్రాంతాలకు 32 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇవన్నీ ఏలూరులో ఆగనున్నాయి.

07089 సికింద్రాబాద్ -బరంపురం (జనవరి 7, 14 తేదీల్లో)
07090 బరంపురం - వికారాబాద్ (8, 15)
07091 వికారాబాద్ - బరంపురం (9, 16)
07092 బరంపురం - సికింద్రాబాద్ 10, 17)
08541 విశాఖపట్టణం - కర్నూలు సిటీ (10, 17, 24)
08542 కర్నూలు సిటీ - విశాఖపట్టణం (11, 18, 25)
08547 శ్రీకాకుళం - వికారాబాద్ జనవరి (12, 19, 26)
08548 వికారాబాద్ - శ్రీకాకుళం జనవరి(13, 20, 27)
07271 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ (12)
07272 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ (13)
07093 సికింద్రాబాద్ - బరంపురం (8,15)
07094 బరంపురం - సికింద్రాబాద్ (9,16 తేదీల్లో)

ప్రధాని మోదీ ఫొటో ఏదీ ?

అధికారులను ప్రశ్నించిన కేంద్ర మంత్రి రూపాలా



దిగమర్రులో ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి

పాలకొల్లు రూరల్, జనవరి 3: సాగర్ పరిక్రమలో భాగంగా ఫిష్ రెస్టారెంట్లు, స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకుని యువత ఉపాధి పొందాలని కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖ మంత్రి పర్షోత్తం రూపాలా అన్నారు. పాలకొల్లు మండలం దిగమర్రు-కొత్తపేట బైపాస్ వద్ద రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా రెస్టారెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత ఉపాధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సాగర్ పరిక్రమ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టామన్నారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గల అవకాశాలను అంచనా వేసేందుకు తమిళనాడు, గోవా, మహారాష్ట్రల్లో పర్యటించి ఈనెల 6వ తేదీ వరకూ ఆంధ్రప్రదేశ్‌లో ఎం.ఎం.ఎస్.వై. స్కీంలపై ప్రచారంతో పాటూ రైతుల మాదిరిగానే మత్స్యకారులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డులు అంది స్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్ బోర్డుపై ప్రధాని మోదీ ఫొటో లేకపోవడాన్ని గమనించిన ఆయన మోదీ ఫొటో ఏదని అధికారులను ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై మోదీ ఫొటో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఏం సమాధానం చెప్పాలో తెలియని అధికారులు మిన్న కుండి పోయారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

భీమవరం టౌన్, జనవరి 3 :పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్ధన స్వామిని బుధ వారం కేంద్ర మత్స్య, పశు సంవర్థక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణలు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున శేషవస్త్రం, ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందించారు.

జాతీయ బాస్కెట్‌బాల్‌కు ఏలూరు విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 3 : చత్తీస్‌గడ్‌లో ఈ నెల 4 నుంచి 7వ తేదీవరకు జరుగ నున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) అండర్-17 జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎ.రుత్విక, జి.పూజిత ఎంపికైనట్టు స్కూలు హెచ్ఎం జి.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రజట్టు ఎంపిక కోనసీమ జిల్లా రాయవరంలో ఇటీవల జరిగిందని వివరించారు. విద్యార్థినులను, పీఈటీ కె.మురళీకృష్ణ, ప్రసన్నలను అభినందించారు.

గణతంత్ర వేడుకలకు ఎన్‌సీసీ కేడెట్ పవన్ సాయి ఎంపిక



భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 3 : ఈనెల 26వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ గణతంత్ర వేడుక లకు భీమవరం డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ కాడెట్ పవన్ సాయి విఘ్నేష్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శాంతకు మారి తెలిపారు. విఘ్నేష్‌ను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ వీరయ్య, పాలకవర్గ సభ్యులు అభినందించారు.

బీరు బాటిల్‌తో అన్నపై తమ్ముడి దాడి

కౌలు డబ్బులు విషయంలో తగాదా



గాయపడిన వెంకటేశ్వరావుకి ప్రాథమిక చికిత్స చేస్తున్న 108 సిబ్బంది.. దాడికి పాల్పడిన తమ్ముడు సూరిబాబు

బుట్టాయగూడెం, జనవరి 3 :కౌలు డబ్బుల విషయంలో అన్నపై తమ్ముడు దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన బుధవారం మర్లగూడెంలో జరి గింది. మర్లగూడేనికి చెందిన తుష్టి వెంకటేశ్వరావు, తుష్టి సూరిబాబు ఇద్దరూ అన్నదమ్ములు. ఇద్దరి మధ్య చాలాకాలంగా భూవివాదం నడుస్తున్నది. ఇరు వురికి రెండు ఎకరాల వంతున భూమి ఉంది. భూమి కౌలు విషయంలో వారి మధ్య కొంతకాలంగా గొడవలు తలెత్తాయి. కౌలు డబ్బులు అడిగితే సహించేది లేదని పలుమార్లు తమ్ముడు సూరిబాబు అన్న వెంకటేశ్వరావుకు తేల్చి చెప్పాడు. ఈనెల 2న కౌలు డబ్బులు ఇవ్వాలని తమ్ముడిని అడిగాడు. ఇవ్వక పోవడంతో తమ్ముడు పొలంలోని వ్యవసాయ బోరు మోటారు ఫీజులను అన్న తొలగించాడు. దీంతో కోపం పెంచుకున్న సూరిబాబు బుధవారం ఉదయం బీరుబాటిల్‌తో అన్న తలపైన, నుదిటిపైన కొట్టడంతో బలమైన గాయాల య్యాయి. అతడిని 108లో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. ఎస్సై కె.వెంకన్న ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి బంధువు కొవ్వాసు మహాలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దాడిచేసిన సూరిబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 3 : సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు. కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రానికి సారా తరలి స్తున్నారనే సమాచారంతో బుధవారం టి.నరసాపురం మండలం మర్రిగూడెం పంచాయతీలోని లంకాలపల్లి చెక్‌పోస్టు వద్ద దాడి చేసి రెండు లీటర్లు సార స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మాకూ ఇవ్వండి!





"సార్.. వాడొక్కడే పార్టీకి పని చేస్తున్నాడా ? మేం చేయట్లేదా? పోయిన సారి పందేల బరి వాళ్లకే ఇచ్చారు. ఈసారి మాత్రం మాకు ఇవ్వాల్సిందే. ఊళ్లో తల ఎత్తుకోలేక పోతున్నాం." ఓ ప్రజాప్రతినిధి వద్ద కోడి పందేల బరి కోసం వైసీపీకి చెందిన ఒక నాయకుడి ఆవేదన..

"అన్నా..ఈసారి ఎవరు వచ్చి బరి వేస్తామన్నా ఊరుకోవద్దు. పెద్దాయన మాకు ఈసారి మాటిచ్చారు. రేపటికల్లా బరి సిద్ధం అవుతుంది. మాకు సపోర్ట్ చేస్తే మీ వాటా మీకు వచ్చేస్తుంది.." ఓ పోలీస్ స్టేషన్ రైటర్‌తో బరి నిర్వాహకుడు ఒప్పందం..

వైసీపీ నాయకుల మధ్యే పోటీ
ఎమ్మెల్యేల వద్ద పంచాయితీలు
ఎన్నికల ముందు తాపత్రయం
కొత్త ఏడాది తొలి రోజు నుంచే మొదలైన కోడిపందేలు
మామూళ్ల మత్తులో అధికారులు

పందెం బరుల కోసం పైరవీలు

(ఏలూరు /కైకలూరు-ఆంధ్రజ్యోతి)

బరుల కోసం పందెంరాయుళ్లు బారులు తీరుతున్నారు. మాకంటే మాకే అవకాశం ఇవ్వాలంటూ ఎమ్మెల్యేల వద్దకు క్యూలు కడుతున్నారు. ఊళ్లో పరువు నిలబెట్టుకోవాలంటే పందేలు తమ నేతృత్వంలోనే జరగాలని అధిక శాతం నిర్వాహకులు ఉవ్విళ్లూరుతున్నారు. ఫలితంగా నాయకుల నీడలో పలుచోట్ల నూతన సంవత్సరం తొలిరోజు నుంచే బరుల కోసం పైరవీలు మొదలయ్యాయి. ఏలూరు రూరల్, దెందులూరు, పెదవేగి, కైకలూరు, జంగా రెడ్డిగూడెం, లక్కవరం తదితర చోట్ల ఇప్పటికే పలు భారీ బరులు పందేలకు ఆహ్వానం పలుకుతున్నాయి. ఇవేగాక మరికొన్ని మారుమూల గ్రామాల్లో చిన్నా చితక బరులు ఆడంబరాలు లేకుండా సాగిపోతున్నాయి.

మేం పనిచేయట్లేదా ?

కోడిపందేల బరుల కోసం జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి ఈసారి భారీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనధికారికంగా అయినా సరే భారీగా బరులు ఏర్పాటు చేయడానికి పలువురు అధికార పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులు ఉత్సుకత చూపుతున్నారు. ఎన్నికల సమయం దగ్గరలో ఉండటంతో మళ్లీ అవకాశం వస్తుందో లేదోనన్న కంగారు ప్రతీ ఒక్కరిలో కనిపిస్తోంది. దెందులూరు, పెదవేగి, ఏలూరు రూరల్ ప్రాంతాల్లో భారీ స్థాయిలో బరుల ఏర్పాటుకు ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. అంతకు ముందు బరులు ఏర్పాటు చేసిన వారిని కాదని తమకే బరుల ఏర్పాట్లకు అవకాశం కల్పించాలని మరికొందరు నాయకులు ఎమ్మెల్యేల సిఫారసుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. ఆదేమంటే ప్రతీసారి బరులు ఒక వర్గానికే ఇస్తున్నారని, తాము పార్టీకి పనిచేయట్లేదా ? అని ప్రశ్నిస్తుండటం గమనార్హం. ఈ క్రమంలో ఏ వర్గాన్ని కాదనుకున్నా ఎన్నికల సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదనే కోణంలో ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారు. 'పండుగకు ఇంకా సమయం ఉందిగా చూద్దాంలే' అంటూ కొందరు ప్రజా ప్రతినిధులు మాట దాటవేస్తున్నారు. మరికొందరు మాత్రం సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి తక్షణమే సిఫారసులు చేస్తున్నారు. కాగా ఎమ్మెల్యేల ప్రమేయం కూడా లేకుండా అధిక శాతం నాయకులు పందెం బరులను సిద్ధం చేస్తున్నారు. అందులో కొందరు ఉదయం నుంచి రాత్రి వరకు బరులు సాగిస్తుండగా, ఇంకొందరు రాత్రిళ్లు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పలు గ్రామాల్లోనూ ఈ బరుల ఏర్పాట్లపై నాయకుల్లోనే ఒకరికొకరు వాగ్వా దాలకు కూడా దిగుతుండటం కొసమెరుపు. దీంతో ఇపుడు గ్రామ, మండల పార్టీ నాయకులకు ఆ బరుల నిర్వాహకుల నుంచి తల నొప్పులు మొదల య్యాయి. ఎవరికి మద్దతివ్వాలో, ఎవరికి సర్ది చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు.

పోలీసులతో ఒప్పందాలు

జిల్లా కేంద్రానికి అతి సమీపంలో బరులు వేస్తున్నా ఏ అధికారీ పట్టించు కోకపోవడంపై పలు విమర్శలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఆరా తీయగా పలువురు బరుల నిర్వాహకులు కొందరు స్టేషన్లలోని రైటర్లతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారన్న వార్త గుప్పుమంటోంది. ఈ క్రమంలో బరులు ఏర్పాటు చేస్తోన్న పరిధిలోని పోలీస్ స్టేషన్లలోని రైటర్లతో పలువురు నిర్వాహకులు ముందస్తు ఒప్పందాలు చేసుకునే ప్రయత్నాల్లో పడ్డారు. తమ తమ ప్రాంతాల్లో తామే పందేలు వేయిస్తున్నామని, వేరే వాళ్లకు అనుమతులు ఇవ్వవద్దని, ఆమ్యామ్యాలు సైతం అంది స్తామని హామీలు కూడా ఇస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతులు అందితే కచ్చితంగా సహకరిస్తామని, ఏయే ప్రాంతాల్లో ఎవరెవరికి సూచిస్తున్నారో పండుగ మూడు రోజుల బాధ్యత తాము తీసుకుంటామని కొందరు అధికారులు సైతం హామీ ఇస్తున్నట్లుగా భోగట్టా. అందువల్లే జిల్లాలో ప్రస్తుతం ప్రారంభమైన బరులపైనా అధికారులు ఎవరూ పెద్దగా స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్ సందేశాలతో

వాట్సప్, ఫేస్‌బుక్‌ల సాయంతోనూ ఈమధ్య బరులు కొనసాగిస్తున్నారు. వాట్సప్, ఫోన్ల ద్వారా సందేశాలు పంపుతూ ఏరోజు, ఎక్కడెక్కడ పందేలు జరుగుతున్నాయో సమాచారం అందిస్తున్నారు. సంక్రాంతికి పది రోజులు ముందే ఈ ఆన్‌లైన్ కోడిపుంజులు రాత్రిపూట పోటీకి సై అంటున్నాయి. కాలువ గట్లు, చేపల చెరువు గట్లు, బహిరంగంగా ఉన్న ఖాళీ ప్రదేశాలే అడ్డాగా జూదాలు నిర్వహిస్తున్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గ్రామాల్లో ఇప్పుడు పందేల వాతా వరణం కనిపిస్తోంది. ప్రతీరోజూ పేకాట ఏ ప్రాంతాల్లో నిర్వహించేది వాట్సప్ మేసేజ్‌ల ద్వారా, ఫోన్ కాల్స్ ద్వారా రెండు గంటల ముందు సమాచారం అందిస్తున్నారు.పోలీసులకు తెలిసినా చూసీచూడకుండా వదిలివేస్తున్నారని, వేలల్లో ముడుపులు అందుకుంటు న్నారని సమాచారం. కొన్నిచోట్ల రోజు వారికి రూ.30 వేలు, మరికొన్నిచోట్ల రూ.5 నుంచి రూ.10 వేల వరకు బేరాలు కుదుర్చుకుంటున్నారని తెలుస్తోంది.

అక్కడ..అడుగడుగునా జూదాలు

కైకలూరు మండలం వరహాపట్నం, రాచపట్నం, భుజబలపట్నం, ఆటపాక, శ్యామలాంబపురం, దొడ్డిపట్ల, రామవరం, కొల్లేరు గ్రామమైన పందిరిపల్లి గూడెంలో జూదాలు జరుగుతున్నాయి. అలాగే ఆటపాక పక్షుల కేంద్రం సమీపాన ఉన్న ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో భారీగా పేకాట, కోడిపందాలు నిర్వహిస్తున్నారు. పక్షుల కేంద్రానికి ఆనుకొని ఉన్న పోల్‌రాజ్ డ్రైన్ కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నందున పందెపు రాయళ్లు బైక్‌లను పక్షుల కేంద్రం గట్టుపై నిలుపుదల చేసి పడవలు దాటుకుంటూ వెళ్లిమరీ పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్నారు కైకలూరులో పోల్‌రాజ్ డ్రైన్ గట్టు వెంబడి పక్షుల కేంద్రం సమీపంలో తుమ్మ చెట్ల మధ్య పేకాట నిర్వహిస్తున్నారు. కొద్దిరోజులు అదే ప్రాంతానికి డ్రైన్ అవతలి వైపుకు పడవలపై వెళ్లి పేకాట ఆడుతున్నారు. ఆ ప్రాంతం ఏలూరు రూరల్ మండలం కావడంతో అక్కడి పోలీసులకు తెలిసి దాడులు నిర్వహించగా ఆ శిబిరాన్ని కైకలూరు వైపు మారుస్తున్నారు. కైకలూరులో ఒక వార్డు సభ్యుడు ఆధ్వర్యంలో తమ చెరువుగట్టుపై నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని భారీ ఎత్తున కోత ఆటకు దారితీశారు. ఉప్పుటేరు సమీపాన ఓ రాజుగారి చెరువుపై, వరహాపట్నం లోని చేపలచెరువు గట్టుపై ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడిపందాలు వేస్తున్నారు. పందిరిపల్లి గూడెంలో ఓ గ్రామపెద్ద ఆధ్వర్యంలో వేసే కోడి పందేల బరిలో రూ.2 నుంచి రూ.5 వేలు తీత తీస్తున్నారు. దీనిలో భారీగా పోలీసులు ముడుపులు అందుకుంటున్నట్లు సమాచారం. కలిదిండి మండలం పెదలంక గ్రామంలో డిసెంబరు 31, జనవరి 1వ తేదీన భారీ ఎత్తున కోడిపందాలను వేశారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు, వైవాక, చేవూరు మండవల్లి మండలం భైరవపట్నం, చింతపాడు, అయ్యవారిరుద్రవరం, కొవ్వాడలంక, లోకుముడి గ్రామాల్లో భారీఎత్తున పేకాట, కోడిపందేలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండగకు ముందే పెద్దఎత్తున జూదాలు నిర్వహిస్తే పండుగ రోజుల్లో ఇంకెలా ఉంటాయోనని ఊహాగానాలు వెలువడుతున్నాయి.

చింతమనేని పుట్టినరోజుకు వెయ్యి కిలోల కేక్..

పెదపాడు/పెదవేగి,జనవరి 3 : దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుట్టినరోజు వేడుకలు అప్పనవీడు, కొత్తూరు గ్రామాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. ప్రభాకర్ తొలుత అప్పనవీడు అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు వేమూరి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో కట్ చేశారు. టీడీపీ మండల యూత్ అధ్యక్షుడు కొత్తూరు చిన బాబు ఏర్పాటు చేసిన రూ.2.5 లక్షలతో సుమారు 1000 కేజీల భారీ కేక్‌ను ట్రాలీపై ఊరేగింపుగా దుగ్గిరాలలోని ఆయన ఇంటికి తీసుకెళ్లగా పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో చింతమనేని కట్ చేశారు. గారపాటి స్టాలిన్, బొప్పిడి కాశీబాబు, మోరు శ్రావణి, గారపాటి రామసీత, గుత్తా అనిల్, మోరు దశరధ్ తదితరులు పాల్గొన్నారు.



అభిమానులు, పార్టీ కార్యకర్తలు తీసుకువచ్చిన వెయ్యి కేజీల భారీ కేక్ కట్ చేస్తున్న చింతమనేని ప్రభాకర్



ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

భీమవరం టౌన్, జనవరి 3 :భీమవరంలో బుధవారం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి 105వ ఆరాధనోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. సన్నాయి మేళాలతో సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులతో పట్టణ ప్రధాన వీధుల్లో శోభాయాత్ర చేశారు. రాత్రి త్యాగరాజ భవనంలో హైదరాబాద్‌కు చెందిన నృత్య రవళి కల్చరల్ అకాడమీ కూచిపూడి, భారత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ముందుగా ఎస్‌బీఐ మేనేజర్ కుమార్, డాక్టర్ గంధం విశ్వేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, కారుమూరి ఆదిత్య, చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి తదితరులు పాల్గొన్నారు. పీఎస్ఎం పాఠశాల విద్యార్థులు ఇంద్రవిజయం- తెలుగు సాహిత్య రూపకం ప్రదర్శించారు.



నాటకమా?...నమస్తే నాటికలోని సన్నివేశం

సందేశాత్మకంగా నాటికలు

ఏలూరు కల్చరల్, జనవరి 3:గరికపాటి ఆర్ట్స్ థియేటర్, హైదరాబాద్ మహతి క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో జరుగుతున్న నాటకోత్సవాల్లో 2వ రోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి. గరికపాటి ఆర్ట్స్ అధినేత కాళిదాసు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఒంగోలు పండు క్రియేషన్స్ కొప్పోలు వారు "నాటకమా?...నమస్తే" నాటిక ప్రేక్షకులను అలరించింది. నాటకం గొప్పతనాన్ని తెలియచెప్పి మిత్రుడిని కాపాడుకునే ఇతివృత్తంతో సాగిన నాటిక ప్రేక్షకులను విశేషంగా అలరించింది. అనంతరం సంసారంలో వచ్చే ఎత్తుపల్లాలు అధిగమించి భార్యభర్తలు సీతారాముడు, పార్వతీ పరమేశ్వరుల్లా కలకాలం కలిసి ఉండాలనే కథాంశంతో ప్రదర్శించిన'బంధం' నాటిక విశేషంగా ఆకట్టుకుంది. నటీనటులు తమ ఆహార్యంతో ఆకట్టుకున్నారు.

క్రైం కార్నర్

భార్య కాపురానికి రాలేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య

నిడమర్రు జనవరి 3 : భార్య కాపురానికి రాకపోవడంతో మనస్థాపంతో పురుగుల మందు తాగిన భర్త చికిత్స పొందుతూ మృతిచెందాడు. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన అయితం క్రాంతి కుమార్‌కు, తోకలపల్లి గ్రామానికి చెందిన గంగారత్నంతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది.వీరికి ఇద్దరు పిల్లలు. కొద్దికాలంగా భర్త చెడు వ్యసనాలకు బానిసై కట్నం కోసం వేధిస్తున్నాడు. గతంలో పెద్దల సమక్షంలో రాజీ చేసి కాపురానికి పంపినప్పటికీ భర్త ధోరణి మారకపోవడంతో ఆమె పుట్టింటికి వచ్చి భర్తపై డిసెంబరు 29న ఫిర్యాదు చేసింది. భార్య పిల్లలను చూడడానికి వచ్చి ఈనెల 2న నిడమర్రు ఆంజనేయస్వామి గుడివద్ద పురుగులమందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికుల సమాచారంతో 108లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.పరిస్థితి విషమంగా మారడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా బుధవారం తెల్లవారుజామున చని పోయినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు కేసు మేరకు నమోదు చేసి విచారణ చేసున్నట్లు నిడమర్రు ఎస్ఐ శ్రీను తెలిపారు.

భార్యతో గొడవ..కాలువలోకి దూకిన భర్త

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 3: భార్యతో గొడవపడి మనస్థాపంతో ఆమె ఎదటే కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి గల్లంతయ్యాడు. తాడేపల్లిగూడెం సుబ్బారావుపేటకు చెందిన నాదెళ్ల చంద్రశేఖర్ (50) కారు నడుపుకుంటూ జీవనం సాగిస్తాడు. అయితే చంద్రశేఖర్‌కు అతని భార్యకు గత కొంతకాలంగా మనస్పర్థలతో గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో వ్యక్తిగత పనిమీద భార్య, భర్తలు తణుకు రోడ్డులోని బస్టాండ్ వద్ద గొడవపడటంతో మనస్థాపానికి గురైన చంద్రశేఖర్ ఆమె కళ్లెదుటే కాలువలోకి దూకేశాడు. అతని కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలించారు. కాలువ వేగంగా ప్రవహిస్తుండటంతో ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై ఎస్సై సుధాకరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జనవరి 3 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై విజయవాడ ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. శ్రీరామ్‌నగర్ 10వ రోడ్డునకు చెందిన చెక్కా ప్రసాద్ (64) గత నెల డిసెంబరు 21న దత్తాశ్రమం రోడ్డులో నడిచి వెళ్తుండగా శనివారపుపేటకు చెందిన పామర్తి బర్నబాబు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ప్రసాద్‌ను విజయవాడ తీసుకువెళ్ళగా అక్కడ ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సంఘటనపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం..కేసు నమోదు

ద్వారకాతిరుమల, జనవరి 3: కొత్తగూడెంకు చెందిన ఓ మహిళ మంగళ వారం ఇంటి వద్ద నుంచి కనిపించకుండా వెళ్లి పోయిందని ద్వారకా తిరుమల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామానికి చెందిన జయవరపు వెంకటలక్ష్మి (35) ఇంటి నుంచి అదృశ్యమైనట్లు భర్త సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 3 :కడుపు నొప్పి భరించలేక ఒక వ్యక్తి పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని వట్లూరు పంచాయతీ పరిధిలోని మెయిన్ బైపాస్ గోభూమి కాలనీకి చెందిన పామర్తి ఆంజనేయులు (37) కొంత కాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక గత నెల 15వ తేదీన పురుగు మందు తాగాడు. అప్పటి నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఏలూరు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పందెం కోళ్ల దొంగలొస్తున్నారు..జాగ్రత్త

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 3 : పందెంకోళ్లు కాజేసే దొంగలు తిరుగుతున్నారు.. కోళ్ళు భద్రం అంటూ కోడై కూస్తున్నారు కోళ్ళ నిర్వాహకులు. సంక్రాంతి కోడిపందాల నేపథ్యంలో కోళ్ళను పందాలకు సిద్ధం చేయడమే కాదు.. వాటిని కోళ్ళను భద్రంగా కాపాడుకోవాలి. వేల నుంచి లక్షల్లో ధర పలికే కోళ్ళను రాత్రికి రాత్రి మాయం చేసే ముఠాలకు ఇదే అసలైన సమయం అంటున్నారు. మంగళవారం రాత్రి జంగారెడ్డిగూడెం పట్టణం సాలిపేటకు చెందిన ఓ యువకుడికి సంబంధించిన పందెం కోడిని గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. అయితే ఆ కోడి విలువ రూ. 50 వేల పైనే ఉంటుందని సమాచారం.

బంగారం కొంటామని మోసం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 3 : బంగారం కొంటామని వచ్చిన ఒక వ్యక్తి ఆ బంగారం తీసుకుని ఉడాయించడంతో బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశారు. ఏలూరులో ఉన్న బీమా గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న విజయవాడకు చెందిన వేళాయుదం సారంగపాణి తన బ్రాంచ్ ద్వారా బంగారాన్ని కొనుగోలు చేయడానికి విజయవాడకు చెందిన అజిత్‌కుమార్ అనే వ్యక్తి ఫోన్ చేసి బంగారాన్ని తీసుకురావాలని చెప్పాడు. ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు మళ్ళీ ఫోన్ చేసి మేము భోగాపురంలో ఉన్నామని అక్కడకు రావాలని అజిత్ కుమార్ చక్రవర్తికి చెప్పాడు. దీంతో చక్రవర్తి తన బ్రాంచ్‌కు సంబంధించిన 335 గ్రాముల బంగారాన్ని మరో నలుగురు సహాయంతో కారులో బయలుదేరి అక్కడకు వెళ్ళారు. అక్కడ నుంచి మళ్ళీ ఏలూరు ఆర్‌ఆర్ పేటనకు అజిత్ కుమార్ తీసుకువచ్చి ఒక నిర్మాణం పైకి తీసుకువెళ్ళి ఆ బంగారాన్ని తీసుకుని ఫోన్ మాట్లాడుకుంటూ ఆకస్మాత్తుగా అక్కడ నుంచి జారుకున్నాడు. అతని కోసం వెతికినప్పటికీ ఆచూకీ కానరాలేదు. దీంతో చక్రవర్తి ఏలూరు టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయడంతో సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



యలమంచిలి, జనవరి 3: మండలంలోని మేడపాడు గ్రామంలో పెద పట్నపు ఈశ్వరరావుకు చెందిన పెంకు టిల్లు విద్యుత్తు సర్క్యూట్ కారణంగా బుధవారం ఉదయం దగ్ధమైంది. వీఆర్ఏగా పనిచేస్తున్న ఈశ్వరరావు డ్యూటీ వెళ్లగా, అతని భార్య పనిమీద బయటకు వెళ్లింది. ఉదయం సుమారు 11 గంటలకు పెంకుటిల్లు నుంచి మంటలు, దట్టమైన పొగ రావడాన్ని చూసిన ఇరుగుపొరుగువారు ఈశ్వరరావుకు, ఫైర్ ఆఫీస్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, కె.సురేష్‌కుమార్, బి.వి.రమణ, పి.సూరిబాబు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇంట్లో ఫ్రిజ్, తదితర విద్యుత్తు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమై ఉండటంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభ వించినట్లు ఫైర్ ఆఫీసర్ జానకీరామ్ తెలిపారు.

ఎస్టీ ఫేక్ సర్టిఫికెట్స్ మాఫియాను అరికట్టాలి

గిరిజన సమస్యలపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం



పాలకోడేరు, జనవరి 3 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్టీ ఫేక్ సర్టిఫికెట్స్ మాఫియా రెచ్చిపోతున్నారని వారికి అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు టీడీపీ పశ్చిమ గోదావరి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు సాల మల్లేశ్వరరావు వినతి పత్రం అంద జేశారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ మాఫి యా ఫేక్ సర్టిఫికెట్స్ సృష్టించి నిజమైన ఎస్టీలకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. పలు ప్రాంతాలలో ఎస్టీలు కాకపోయినా రెవెన్యూ డిపార్టమెంట్ వారు ఎస్టీలని కుల ధృవీకరణ పత్రాలు ఇస్తున్నారన్నారు. తప్పుడు ఎస్టీకుల ధృవీకరణ పత్రాలు ఇస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీలో కొన్ని గిరిజన సంఘాల నాయకుల అండదండలతో లక్షలలో డబ్బుని హెచ్చించి ఎస్టీ ఫేక్ సర్టిఫికెట్స్‌ను సృష్టిస్తున్నారన్నారు.

జడ్పీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలేకి నివాళులు



ఏలూరు రూరల్, జనవరి 3: ఏలూరు జడ్పీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు జడ్పీచైర్మన్ పద్మశ్రీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్య ద్వారా స్త్రీవిముక్తి సాధ్యపడుతుందని నమ్మి సావిత్రీబాయి పూలే బాలికల పాఠశాలలను ప్రారంభించారన్నారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, ఎస్.నిర్మలజ్యోతి, ఘంటా ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉంగుటూరు నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

జనసేన, టీడీపీ సమన్వయంతో పనిచేయాలి

ఉంగుటూరు, జనవరి 3: జనసేన, టీడీపీ అనుబంధం చిరకాలం కొనసాగాలని ఇరుపార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో నేతలు అన్నారు. ఉంగుటూరు జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. ఎవరికి టిక్కెట్లు వచ్చినా ఇరు పార్టీల కార్యకర్తలు సమన్వయంతో కలసి పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామం నుంచి సమన్వయ కమిటీలను నియమించుకోవాలని సూచించారు. వైసీపీ పాలనలో ఆక్వా రంగాన్ని కుదేలు చేశారని, భవిష్యత్తులో వరి రైతులతో కలసి ఉమ్మడి ఉద్యమాలు చేయాలని పత్సమట్ల ధర్మరాజు అన్నారు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన సమయంలో పవన్ కల్యాణ్ మద్దతు ఇచ్చారని గన్ని గుర్తు చేశారు. సమావేశంలో నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, తెలుగు మహిళలు, వీర మహిళలు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి ఐకమత్యంగా పనిచేసి అఖండ విజయం సాధిద్దామని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. బుధవారం చింతమనేని ప్రభాకర్ జన్మదినోత్సవం సందర్భంగా జనసేన కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అనంతరం అప్పలనాయుడు, నేతలు దుగ్గిరాలలోని చింతమనేని నివాసానికి వెళ్ళి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగిరెడ్డి కాశీ నరేష్, బొత్స మధు, బోండా రామునాయుడు, రెడ్డి గౌరీశంకర్, కందుకూరి ఈశ్వరరావు, అల్లు సాయిచరణ్, నిమ్మల శ్రీను, కందుకూరి ఈశ్వరరావు ఉన్నారు.

'వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి'

పోలవరం, జనవరి 3: ప్రజలు వైసీపీ అసమర్థ పాలనకు చరమగీతం పాడాలని జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు అన్నారు. పోలవరంలో బుధవారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గడ్డమణుగు రవికుమార్, పాదం కృష్ణ, గునపర్తి చిన్ని, తెలగంశెట్టి రాంప్రసాద్, చీకట్ల సాయికృష్ణమూర్తి, మామిడిపల్లి వరప్రసాద్, వనిమిరెడ్డి సీతయ్య, తుర్రం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాములు తనిఖీ చేసిన జేసీ

ఏలూరు సిటీ, జనవరి 3: ఏలూరులోని పౌర సరఫరాల గోదాములను జేసీ బి.లావణ్యవేణి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ప్రతి నెలా 1 లోగా ఏలూరు ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలోని రేషన్ దుకాణాలకు బియ్యం, కందిపప్పు, పంచదార, అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు త్వరితగతిన సరఫరా చేయాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జికి ఆదేశాలు జారీ చేశారు. టేక్‌హోం సరుకులు రవాణాపై సివిల్ సప్లయి జిల్లా మేనేజరు మంజూభార్గవిని అడిగి తెలుసుకున్నారు. హమాలీలతో మాట్లాడి వారి హాజరు పట్టిక పరిశీలించారు. గోడౌన్ ఇన్‌చార్జి, డేటా ఎంట్రీ ఆపరేటర్ పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. డీఎస్‌వో ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెన్షన్లు పంపిణీ ప్రారంభం

ఏలూరుసిటీ, జనవరి 3: వైఎస్ఆర్ పింఛన్‌కానుక కింద జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పెన్షన్లకు సంబంధించి జనవరి నెలకు 2,72,955 మందికి రూ.81.53 కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ తెలిపారు. పెంచిన పెన్షన్ రూ.3వేలు పెంపు కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్దిదారులకు నమూనా చెక్‌ను అందజేయటంతో పాటు మరికొంత మంది లబ్దిదారుకు జనవరి నెల పెన్షన్ మొత్తాన్ని అందజేశారు.

● చింతలపూడి: పెంచిన పెన్షన్లను ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ప్రారంభించారు. చింతలపూడి మండలంలో 9,700 మందికి పెన్షన్లు అందుతున్నాయని, ఎంపీడీవో మురళీకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో మణికుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పెన్షన్లు పంపిణీ చేశారు. మండలంలో 187 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. ఎంపీపీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, జె.ఎమ్ రత్నకుమార్, అధికారులు పాల్గొన్నారు.

● పోలవరం: పెంచిన 3 వేల రూపాయల పెన్షన్‌లను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దారు బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, సర్పంచ్‌లు పొడుం పుష్ప, మైగాపుల విజయ దుర్గాప్రసాద్, కోరశిక శ్రీనివాస్, పాదం రాజబాబు, పాతిమున్నీసా పాల్గొన్నారు. బెస్తావీధికి చెందిన 105 ఏళ్ల పసుపులేటి వరహాలమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరింది. వలంటీర్ ఎస్‌కె పోశమ్మ ఆసుపత్రికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందించారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ లక్ష్మణబాబు

ఏలూరు క్రైం, జనవరి 3 : జిల్లాలో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ చేయించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, లాడ్జిలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించారు. ప్రార్థనాలయాలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద తనిఖీలు చేశారు. గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణా జరగకుండా రహదారులపై వాహనాలను తనిఖీ చేశారు.

ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ

ఏలూరు క్రైం, జనవరి 3 : ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, కక్షిదారులకు కౌన్సెలింగ్ పనితీరుపై ఆరాతీశారు. పలువురికి రత్న ప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ పరిపాలనాధికారి చుక్కా నిర్మల పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

ఏలూరు క్రైం, జనవరి 3 : జిల్లా ఆర్ముడు రిజర్వు డీఎస్పీగా బి.చంద్రశేఖర్ ఉద్యోగ బాధ్యతలను బుధవారం చేపట్టారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఏఎస్పీ ఎంజెవి భాస్కర్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. సిబ్బంది సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని, గ్రీవెన్స్ నిర్వహించాలని ఎస్పీ సూచనలను చేశారు.

పేకాట శిబిరంపై దాడి : ఏడుగురి అరెస్ట్

ఏలూరు క్రైం, జనవరి 3: ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో పేకాట జరుగుతున్నట్లు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డికి బుధవారం సమాచారం అందింది. తన సిబ్బందితో దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి 8,600 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ధర్నా



జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె



కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏలూరులో అంగన్‌వాడీలు, కార్మికుల ర్యాలీ

సమ్మె హోరు

మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆందోళన

అంగన్‌వాడీ వర్కర్లను అడ్డుకున్న పోలీసులు

మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, అంగన్వాడీ వర్కర్ల సమ్మెతో జిల్లా హోరెత్తిపోతోంది. మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికుల సమ్మెలో కార్మిక సంఘాల జేఏసీ కూడా చేరడంతో మరింత ఉధృమైంది. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె 15 రోజులుగా కొనసాగుతోంది. మరోవైపు అంగన్‌వాడీల పట్టు సడలకుండా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి అంగన్వాడీలు కలెక్టరేట్‌కు చేరకుండా పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నారు.. నిర్బంధించారు.

ఏలూరు టూటౌన్, జనవరి 3: మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతమైంది. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల జేఏసీ కూడా తోడవడంతో అన్ని మున్సిపల్ సంఘాల్లోని కార్మికులంతా సమ్మెలోకి దిగారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కాంట్రాక్టు సిబ్బందిని పర్మినెంట్ చేస్తానని ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చలేదని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం నెలకు రూ.26వేలు కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలన్నారు. అన్ని కార్మిక సంఘాలతో కలిపి సమస్యల పరిష్కారానికి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అప్పలరాజు, శ్రీనివాసరావు, భాస్కరరావు, నాగేశ్వరరావు, శివకుమార్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ తెలిపారు. మున్సిపల్ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు పట్టణంలో పారిశుధ్య పనులను విడిచిపెట్టి మున్సిపల్ కార్యాలయం దీక్షా శిబిరంలో కూర్చున్నారు. కె.విఘ్నేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, మంత్రులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. చర్చల పేరుతో తమ నాయకత్వాన్ని పిలిచి చర్చించినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేదంటే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ హామీలను నెరవేర్చాలని లేదంటే రానున్న కాలంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని తెలిపారు. యూనియన్ పట్టణ కార్యదర్శి బొక్కా శ్రీను, ఉపాధ్యక్షుడు ఇంగుర్తి నాగరాజు, రేలంగి నాగరాజు, ఎమిలేశు, ఆల్లే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.





కుక్కునూరులో అంగన్‌వాడీల నిరసన, చేబ్రోలు పోలీస్‌స్టేషన్ వద్ద అంగన్‌వాడీలు

● చింతలపూడి: మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ మునిసిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో నేడు సమ్మె బాట పట్టారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో భాగంగా మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి విన్నవించి మూడు సార్లు చర్చలు జరిపినా ఫలితం లేదని, ఈనెల 17వ తేదీ వరకు వాయిదా వేసుకోవాలని కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. వెలగాడి అనురాధ, శ్రీరామ్ వెంకటయ్య, దాసు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



ఏలూరు నగర పాలక సంస్థ వద్ద కార్మికుల సమ్మె



చింతలపూడిలో మున్సిపల్ కార్మికుల నిరసన శిబిరం

15వ రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

ఏలూరు కలెక్టరేట్: సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకుంది. జేఏసీ నాయకులు భగవాన్ తదితరులు నాయకత్వం వహించారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పదవీవిరమణ వయస్సు 62ఏళ్ళు పెంచాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నేతలు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు.

అంగన్వాడీలను అడ్డుకోవడంపై నిరసన

కుక్కునూరు: శాంతియుతంగా పోరాటం చేస్తున్న అంగన్వాడీలను అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ విమర్శించారు. కలెక్టరేట్ వద్ద మహాధర్నాకు వెళ్లకుండా కుక్కునూరులో అంగన్వాడీలను నిర్బంధించడంతో ప్రధాన రహదారి వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అడిగితే అక్రమంగా అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ధర్నాలో పోచారపు వెంకటేశ్వర్లు, రమేష్, సలోమి, సౌజన్య, విజయ, స్వరూప, జయ, రూపాలత, ఏసుమణి, పుష్పాలు, రూపాలత, కస్తూరి, జయసుధ పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని అంగన్‌వాడీలు ఏలూరు కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. దారిలో పలుచోట్ల పోలీసులు ఆపినా నోటీసులు అందజేసినా వేర్వేరు మార్గాల ద్వారా కలెక్టరేట్ ముట్టడికి చేరుకున్నారు. అంగన్‌వాడీల అధ్యక్షురాలు బీజేఎస్.కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీలను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం త్వరలోనే అంగన్‌వాడీల దెబ్బరుచి చూడాల్సి వస్తుందన్నారు. ఈశ్వరి, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఏలూరు వెళుతున్న అంగన్వాడీలను చేబ్రోలు పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అధికారులతో మాట్లాడడంతో కొంతసేపటికి వదిలారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బడేటి చంటి



యండపల్లిలో నాగరాజు, నేతల ప్రచారం



గద్దేవారిగూడెంలో భవిష్యత్ గ్యారెంటీ పత్రాల పంపిణీ

'వైసీపీ పాలనపై ప్రజలకు విరక్తి'

ఏలూరు టూటౌన్, జనవరి 3: వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు విరక్తి కలిగిందని ఏలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బడేటి చంటి అన్నారు. 48వ డివిజన్‌లో బుధవారం సంకల్పయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో టీడీపీదే అధికారమని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మినీ మేనిఫెస్టో అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. సైకో జగన్‌తో వైసీపీ నేతలు కూడా అభద్రతభావంతో ఉన్నారన్నారు. అధికారంలోకి రాగానే పించన్ రూ.3వేలు చేస్తామని, నాలుగేళ్ల తరువాత రూ.3వేలు చేశారన్నారు. వృద్ధులు, వితంతువులు రూ.40వేలు నష్టపోయారన్నారు. శ్రీనివాస్, అన్నేపల్లి తిరుపతిరావు, కృష్ణవేణి, జబీఉల్లా, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: కేఎస్.రామవరం పంచాయతీ గద్దేవారిగూడెంలో బుధవారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలను అందజేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. నియోజకవర్గ నాయకులు సొంగా రోషన్‌కుమార్, గోరుముచ్చు గోపాల్ యాదవ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ప్రతీ ఇంటికి వెళ్లి పార్టీ విధానాలను వివరిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయంసాధించేందుకు ఇప్పటి నుంచే కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి గోరింక వెంకటేశ్వరరావు, బూత్ ఇన్‌చార్జిలు కోటపాటి శ్రీనివాసరావు, శరణాల సతీష్, మల్లారెడ్డి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: రాష్ట్రంలో బీసీలకు తెలుగుదేశం పార్టీ ద్వారానే న్యాయం జరుగుతుందని నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు అన్నారు. రాఘవాపురం, యండపల్లి, గురుభట్లగూడెం గ్రామాల్లో నాయీ బ్రాహ్మణులను కలిసి మాట్లాడారు. గతంలో సబ్సిడీ రుణాలు, ఆదరణ పథకాలు ఇవ్వడం జరిగిందని, జగన్ ప్రభుత్వంలో వీటిని రద్దు చేశారన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ భరోసా కార్యక్రమంలో ఈ గ్రామాల్లో ఆయన పర్యటించగా ఆయన వెంట పి.నాగేశ్వరరావు, సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, రమేష్, ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

ద్వారకాతిరుమల, జనవరి 3: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్రం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బుధవారం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదాశీర్వచనం, అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయడం లేదు

చింతలపూడి, జనవరి 3: ఇటీవల తుఫాన్‌కు తడిసి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.సోమశేఖరాచార్యులు అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై జిల్లా పౌర సరఫరాల అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి ఆదేశాలులేవని, కొనుగోలు చేయలేమని అధికారులు చెబుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

నన్నయ వర్సిటీ క్రికెట్ జట్టులో రిత్విక్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 3: నన్నయ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.రిత్విక్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 7నుంచి 16వరకు చెన్నైలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయల క్రికెట్ టోర్నమెంట్‌లో నన్నయ తరపున పాల్గొంటాడని వివరించారు. రిత్విక్‌ను ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు శేషారెడ్డి, సుగుణారెడ్డి, నాయుడు తదితరులు అభినందించారు.



మాజీ మంత్రి పీతల సుజాత అమరావతిలో చంద్రబాబును కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జయహో బీసీ సదస్సుకు తరలిరావాలి

కామవరపుకోట, జనవరి 3: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగే జయహో బీసీ సదస్సుకు అన్ని నియోజకవర్గాల నుంచి బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని టీడీపీ బీసీ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ చలమోలు అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీల భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికకు అధినేత చంద్రబాబు దిశ నిర్దేశాలను తెలియజేస్తారని ఎంతో ముఖ్యమైన సమావేశమని, అందరూ విచ్చేసి బీసీల ఐక్యతను నిరూపించాలని కోరారు.

6న నూజివీడులో మహిళా మార్టు ప్రారంభం

ఏలూరు కలెక్టరేట్, జనవరి 3: నూజివీడు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల6న నూజివీడులో ప్రారంభించే వైఎస్సార్ చేయూత మహిళామార్ట్ ప్రారంభోత్సవానికి కలెక్టర్‌ను ఆహ్వానించారు. నూజివీడు మండల మహిళా సమాఖ్య పాలకవర్గ, జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యులు బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 3: ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయ త్రినస్తాహ బ్రహ్మోత్సవాల్లో బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి భక్తులు తిరుప్పావై ప్రవచనలు నిర్వహించారు. గోవిందనామ సంకీర్తనలను ఆలపించారు. ఆలయ ఈవో నాగం సన్యాసిరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తలు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

నేత్రపర్వం.. ధనుర్మాస ఉత్సవం



ద్వారకాతిరుమల, జనవరి 3: ద్వారకా తిరుమల క్షేత్రంలోని విలాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు బుధవారం ఉదయం నిర్వహించిన ధనుర్మాస ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా స్వామివారు, ఉభయదేవేరులు, గోదాదేవి అమ్మవార్లను క్షేత్రపురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఆవరణలో తొళక్కవాహనంపై శ్రీవారు, అమ్మవార్లుతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

పారిజాతగిరిలో ధనుర్మాస ఉత్సవం



జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 3: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. మంగళవారం గోదాదేవి, పద్మావతి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ధనుర్మాసంలో గోపికలు నీలాదేవి అనుగ్రహం పొందిన రోజు కావడంతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి తిరుప్పావై సేవాకాలం అనంతరం నక్షత్ర హారతి, విశేష పాశుర విన్నపము ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి కార్యకర్తలు, ధనుర్మాస గోష్టి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మ హుండీ ఆదాయం రూ.18.88 లక్షలు

పెదవేగి, జనవరి 3: రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ ఆలయంలో హుండీలను బుధవారం తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.18,88,879 వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. దేవదాయ, ధర్మాదాయశాఖ ఏలూరు తనిఖీదారు బాలు పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించామని ఆయన చెప్పారు. ధర్మకర్తల మండలి మాజీచైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది, భక్తులు లెక్కింపులో పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



లింగపాలెం, జనవరి 3: మండలంలో వారం రోజుల వ్యవధిలో మూడు ఆర్టీసీ బస్సులు మొరాయించాయి. ఏలూరు డిపో నుంచి చింతలపూడి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. బుధవారం ప్రయాణికులతో వెళుతున్న బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సుల కండిషన్ మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **కొయ్యలగూడెం :** కన్నాపురంలో అమరవీరుల పేరుతో క్యాలెండర్ జొన్నకూటి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. దళితులు, ఆదివాసీల కోసం అమరవీరులు ఎన్నో త్యాగాలు చేశారని వారి త్యాగఫలితంగా ఎంతో మంది పేద ప్రజలు క్షేమంగా బ్రతుకుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బాబు, మడకం రామన్న, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం భవిత పాఠశాలలో పేద విద్యార్థినికి మానవత సంస్థ ఆర్థికసాయం అందజేసింది. బాలిక కొంతకాలంగా కాలికి గాయం కావడంతో వైద్యఖర్చులు లేక ఇబ్బంది పడుతుండడంతో ఆర్థిక సాయం చేసినట్లు అధ్యక్షుడు బొమ్మా మోహన్ తెలిపారు. రామకృష్ణ, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు, నక్కా బాబి, స్వామి తదితరులు ఉన్నారు.
- **జీలుగుమిల్లి :** రాచన్నగూడెంకు చెందిన టీడీపీ కార్యకర్త కొండపల్లి నాగు ఇటీవల బైక్ ప్రమాదంలో కాలు విరిగింది. పోలవరం టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు పి.శివాజీ, వి.వెంకటేశ్వరావు, పి.దాము, ఎన్.నాగరాజు, ఎ.సూరి, టి.పండు ఉన్నారు.
- **నిడమర్రు :** తోకలపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తోట అప్పారావు ఏపీటీఎఫ్ డైరీ ,కేలండర్స్ ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌కె.రంగావలి మాట్లాడుతూ రాబోయే ఉపాధ్యాయులు సమష్టిగా కృషిచేసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేటట్లు కృషిచేయాలని కోరారు. ఉపాధ్యాయులు రవీంద్ర, కిరణ్, కవిత, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.
- **పోలవరం :** పోలవరం సామాజిక ఆస్పత్రిలో కాన్పు జరుపుకున్న మహిళకు చీర, శిశువుకు సూపరింటెండెంట్ ఎంవి సతీష్‌బాబు నూతన వస్త్రాలు అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. నాణ్యమైన వైద్య సేవలను పొందవచ్చునన్నారు.
- **ఉంగుటూరు :** శివాలయం వద్ద బోరు మరమ్మతులకు గురవడంతో పంచాయతీ నిధులతో సర్పంచ్ సింధు కొత్త బోరు వేయించారు.



ఏలూరులో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుల నివాళి



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పీఆర్టీయూ నాయకులు



రావికంపాడులో ఉపాధ్యాయినులకు సత్కారం



జంగారెడ్డిగూడెం డిగ్రీ కళాశాలలో మహిళకు సత్కారం

సావిత్రిబాయి పూలే..

మహిళా చైతన్యం

జయంతి కార్యక్రమాల్లో పలువురి నివాళి

ఏలూరు రూరల్, జనవరి 3: సావిత్రిబాయి పూలే అంటే మహిళా చైతన్యమని, మహిళల సమస్యలకు పరిష్కారమార్గం చూపిన మహనీయురాలు అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమవరపు పాపారావు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం జూట్‌మిల్ సెంటర్లో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో మహిళలకు విద్యావకాశాలు కల్పించాలని పోరాడిన గొప్ప యోధురాలు సావిత్రిబాయి అన్నారు. బాల్య వివాహాల రద్దుపై పోరాడిన గొప్ప చరిత్ర ఆమెదని అన్నారు. మారగాని చంద్రకిరణ్, తాడిశెట్టి గోపీరావు, ఎం.రంగారావు, టి.వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ, లక్కిరెడ్డి గోవిందరావు, టి.సత్యనారాయణ, రెడ్డిరాంబాబు, బి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సమాజానికి గొప్ప ఆదర్శనీయురాలు సావిత్రిబాయిపూలే అని సంఘసేవకుడు నారాశేషు అన్నారు. మహిళా ఉపాధ్యాయులు 200 మందిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మహిళలు, యువతులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: నగరంలోని పలు విద్యాసంస్థల్లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. బాలికా విద్యను ప్రోత్సహించడానికి ఆమె చేసిన కృషిని విద్యార్థులకు గుర్తు చేశారు. విద్యార్థినులు సావిత్రిబాయిపూలే వేషధారణల్లో ఆకట్టుకున్నారు. తంగెళ్ళమూడి శ్రీసూర్య హైస్కూలు మహిళా టీచర్లను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. జడ్పీ కార్యాలయం వద్ద పూలే దంపతుల విగ్రహాలకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు ఆధ్వర్యంలోని ఉపాధ్యాయ బృందం పూలమాలలువేసి నివాళులర్పించారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమని, ఆమెను స్మరించుకోవడం ఆనందమని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ బాబు అన్నారు. కళాశాల మహిళా సాధికార విభాగ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. కళాశాల మహిళా సాధికార విభాగ అధిపతి టి.ఝాన్సీరాణి మాట్లాడుతూ పూలే ఎంతో కష్టపడిన తర్వాత ఉపాధ్యాయురాలిగా నిలిచిందన్నారు. కళాశాలలో మహిళా సాధికార విభాగంలో టైలరింగ్‌పై సర్టిఫికెట్ కోర్సు ముగియడంతో టైలరింగ్ కోర్స్ నేర్పించిన అయినపర్తి ఉషారాణి విద్యార్థినిలకు సర్టిఫికెట్స్ మంజూరు చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగ మెంబర్లు సిహెచ్.రమాదేవి, ఆర్.విజయ దీపిక, కేవీవీ.శిరీష, సీహెచ్.వెంకటలక్ష్మి అధ్యాపక సిబ్బంది, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, రావికంపాడు హైస్కూలు వద్ద నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు జి.రామ్మోహన్, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, వి.శ్రీనివాస్, దారావతు మల్లేష్, ఎ.హర్షవర్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. రావికంపాడులో హెచ్‌ఎం భీమరాజు, ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

● చింతలపూడి: మేడబడి వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహానికి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్నేపల్లి అప్పారావు, శ్రీనివాస్, దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు.

● ఉంగుటూరు: గొల్లగూడెం ఫౌండేషన్ స్కూలులో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. నాలుగో తరగతి విద్యార్థిని ఇల్లిందల దుర్గశ్రీ సావిత్రి బాయి పూలే వేషధారణతో ఆకట్టుకుంది. హెచ్‌ఎం కొల్లి నాగ పరమేశ్వరి, ఉపాధ్యాయిని ఆకివీడు వాణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు

కైకలూరు టికెట్ ఎవరికిచ్చినా సమిష్టిగా విజయానికి కృషి చేద్దాం

» నియోజకవర్గస్థాయి సమావేశంలో టీడీపీ శ్రేణులు

మండవల్లి, జనవరి 3: టీడీపీ కైకలూరు నియోజకవర్గం టికెట్ ఎవరికి కేటాయించినా సమిష్టిగా వారి విజయానికి కృషి చేద్దామని టీడీపీ శ్రేణులు స్పష్టం చేశారు. మండలంలోని గన్నవరంలో బుధవారం నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. కైకలూరు టికెట్టు ఎవరికి ఇచ్చారన్నది ముఖ్యం కాదని, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని నాయకులు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, పెన్మెత్స వెంకటేశ్వరరాజు, కొడాలి వినోద్, తాడినాడ బాబు, వీరమల్లు నరసింహారావు, పెన్మెత్స త్రినాధరాజు, నారగాని వీర వెంకట నాగేశ్వరరావు,హనుమ ప్రసాదు, ముళ్లపూడి సత్తిబాబు, పళ్లెం ఏడుకొండలు మాట్లాడారు. అనంతరం బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



కరపత్రాలు అందజేస్తున్న నేతలు

ముదినేపల్లి, జనవరి 3 : టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ అన్నారు. ముదినే పల్లిలో బుధవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని ఆదరించాలని కోరారు. పి.పాండు రంగారావు, ఏడుకొండలు, సురేష్, ఈడే సుధాకర్ పాల్గొన్నారు.



టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

పంచాయతీ ఛాంబర్ సమావేశానికి టీడీపీ శ్రేణులు

ముసునూరు, జనవరి 3: టీడీపీ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై బుధవారం మంగళగిరిలో జరిగిన పంచాయతీ ఛాంబర్ సమావేశానికి మండలం నుంచి టీడీపీ శ్రేణులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. సర్పంచ్‌లు కొండేటి విజయలక్ష్మి, గద్దల సుహాసిని, మొక్కపాటి మురళీకృష్ణ, తల్లిబోయిన రాధిక, పులిబళ్ళ లక్ష్మి, కండేపు రామగిరిలు, ఎంపీటీసీలు సూర్యదేవర నాగమంజుల, కాటేపల్లి పుష్పావతి.. వైసీపీ పాలనలో నిధులు దారిమళ్లింపు, క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను అధినేత చంద్రబాబు నాయుడుకు వివరించారు. కందుల పిచ్చియ్య, చిలుకూరి వెంకటేశ్వరావు, కాటేపల్లి నాగేశ్వరరావు, గద్దె రఘుబాబు, మామిడి శెట్టి గిరిబాబు,తోట ప్రభాకర్, కొండేటి బాబి, గద్దల మోహన్‌రావు, తల్లిబోయిన సత్యనారయణ, రంగు వాసు, జోసఫ్, పి.సత్యనారయణ ఉన్నారు.

భూహక్కు చట్టంతో న్యాయపరమైన చిక్కులు



మద్దతు తెలుపుతున్న గంగాధర్

నూజివీడు, జనవరి 3: ల్యాండ్ టైటిల్ యాక్ట్-22ను రద్దుచేయాలని కోరుతూ న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు టీడీపీ నియోజకవర్గ నేత పర్వతనేని గంగాధర్ మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని బుధవారం సందర్శించి మాట్లాడుతూ, భూహక్కు చట్టం అమలు చేస్తే అనేక న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్, టీడీపీ నేత అక్కినేని చందు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికే కేంద్ర పథకాలు



గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న నేతలు

కైకలూరు, జనవరి 3: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కేంద్రం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు అన్నారు. సీతనపల్లి, దొడ్డిపట్ల గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ.. రైతులు, మహిళలు, యువతకు, చిరువ్యాపారులకు చేయూత నిచ్చేందుకు అనేక పథకాలను తీసుకువచ్చారని చెప్పారు. చేతివృత్తివారికి విశ్వకర్మ యోజన, మహిళలకు ఉజ్వల యోజన ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను అందించడం జరుగుతుందన్నారు. ఈవోపీఆర్డీ రవికిరణ్, పద్మావతి, డాక్టర్ అనుపమ, వెంకటరాంప్రసాద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసుల అదుపులో 13 మంది పేకాటరాయుళ్లు

నూజివీడు టౌన్, జనవరి 3: మండలంలోని మిట్టగూడెంలో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు నూజివీడు రూరల్ సీఐ బాలసురేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. 13 మందిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.7,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

45 మంది బైండోవర్

ఆగిరిపల్లి, జనవరి 3: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం 45 మందిని బైండోవర్ చేసినట్టు ఎస్‌ఐ నంబూరి చంటిబాబు తెలిపారు. మండలపరిధిలో కోడిపందేలు, పేకాట, జూదాలు నిర్వహించకుండా ఉండేందుకు గతంలో పట్టుబడిన 45 మందిని అధికారుల వద్ద బైండోవర్ చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 9440796444కు సమాచారం అందించాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ చెప్పారు. సాంప్రదాయ క్రీడలైన కబడ్డీ, షటిల్, వాలీబాల్ పోటీలు నిర్వహించాలన్నారు.

కోడికత్తుల విక్రయదారుడి అరెస్ట్

ముసునూరు, జనవరి 3: బసవరప్పాడులో కోడికత్తులు విక్రయిస్తున్న వ్యక్తిపై మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. కోసూరి శివకృష్ణ కోడికత్తులను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడి ఇంటిపై దాడిచేశారు. సుమారు రూ.41,700 విలువగల 139 కోడికత్తులు దొరికాయని, వాటిని స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రేకులషెడ్‌లు దగ్ధం



ముసునూరు, జనవరి 3: మండలంలోని గుళ్ళపూడి ఎస్సీ కాలనీలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రెండు రేకులషెడ్‌లు దగ్ధమయ్యాయి. యల్లమల్లి వెంకటేశ్వరావు, యల్లమల్లి నాగేశ్వరరావు ఇద్దరూ అన్నదమ్ములు. రేకులషెడ్‌లు వేసుకుని నివాసముంటున్నారు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం ఇరుకుటుంబాలు పనులకు వెళ్లారు., ఈ క్రమంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల రెండిళ్లలో ఒక్కసారిగా మంటల చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి పూర్తిగా దగ్ధమయ్యాయి. విలువైన సామాగ్రి, బంగారపు వస్తువులు, నగదు కాలిపోయాయి. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ దాసరి సుధ, వీఆర్వో నవీన్‌కుమార్ పరిశీలించారు. మొత్తం రెండు లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు చెప్పారు. ప్రభుత్వ సాయాన్ని త్వరలో అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

మాకూ ఇవ్వండి..!



పందెం బరుల కోసం పైరవీలు

» వైసీపీ నాయకుల మధ్యే పోటీ
» ఎమ్మెల్యేల వద్ద పంచాయితీలు
» ఎన్నికల ముందు తాపత్రయం
» కొత్త ఏడాది తొలి రోజు నుంచే మొదలైన జూదక్రీడలు
» మామూళ్ల మత్తులో అధికారులు

"సార్.. వాడొక్కడే పార్టీకి పని చేస్తున్నాడా ? మేం చేయట్లేదా? పోయిన సారి పందేల బరి వాళ్లకే ఇచ్చారు. ఈసారి మాత్రం మాకు ఇవ్వాల్సిందే. ఊళ్లో తల ఎత్తుకోలేకపోతున్నాం." ఓ ప్రజాప్రతినిధి వద్ద కోడిపందేల బరి కోసం వైసీపీకి చెందిన ఒక నాయకుడి ఆవేదన..

"అన్నా..ఈసారి ఎవరు వచ్చి బరి వేస్తామన్నా ఊరుకోవద్దు. పెద్దాయన మాకు ఈసారి మాటిచ్చారు. రేపటికల్లా బరి సిద్ధం అవుతుంది. మాకు సపోర్ట్ చేస్తే మీ వాటా మీకు వచ్చేస్తుంది.." ఓ పోలీస్ స్టేషన్ రైటర్‌తో బరి నిర్వాహకుడు ఒప్పందం చేసుకోవడానికి చేస్తోన్న ప్రయత్నం.



(ఏలూరు /కైకలూరు-ఆంధ్రజ్యోతి)

బరుల కోసం పందెంరాయుళ్లు బారులు తీరుతున్నారు. మాకంటే మాకే అవకాశం ఇవ్వాలంటూ ఎమ్మెల్యేల వద్దకు క్యూలు కడుతున్నారు. ఊళ్లో పరువు నిలబెట్టుకోవాలంటే పందేలు తమ నేతృత్వంలోనే జరగాలని అధిక శాతం నిర్వాహకులు ఉవ్విళ్లూరుతున్నారు. ఫలితంగా నాయకుల నీడలో పలుచోట్ల నూతన సంవత్సరం తొలిరోజు నుంచే బరుల కోసం పైరవీలు మొదలయ్యాయి. ఏలూరు రూరల్, దెందులూరు, పెదవేగి, కైకలూరు, జంగా రెడ్డిగూడెం, లక్కవరం తదితర చోట్ల ఇప్పటికే పలు భారీ బరులు పందేలకు ఆహ్వానం పలుకుతున్నాయి. ఇవేగాక మరికొన్ని మారుమూల గ్రామాల్లో చిన్నా చితక బరులు ఆడంబరాలు లేకుండా సాగిపోతున్నాయి.

మేం పనిచేయట్లేదా ?

కోడిపందేల బరుల కోసం జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి ఈసారి భారీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనధికారికంగా అయినా సరే భారీగా బరులు ఏర్పాటుచేయడానికి పలువురు అధికార పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులు ఉత్సుకత చూపుతున్నారు. ఎన్నికల సమయం దగ్గరలో ఉండటంతో మళ్లీ అవకాశం వస్తుందో లేదోనన్న కంగారు ప్రతీ ఒక్కరిలో కనిపిస్తోంది. దెందులూరు, పెదవేగి, ఏలూరు రూరల్ ప్రాంతాల్లో భారీ స్థాయిలో బరుల ఏర్పాటుకు ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. అంతకు ముందు బరులు ఏర్పాటు చేసిన వారిని కాదని తమకే బరుల ఏర్పాట్లకు అవకాశం కల్పించాలని మరికొందరు నాయకులు ఎమ్మెల్యేల సిఫారసుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. అదేమంటే ప్రతీసారి బరులు ఒక వర్గానికే ఇస్తున్నారని,తాము పార్టీకి పనిచేయట్లేదా ? అని ప్రశ్నిస్తుండటం గమనార్హం. ఈ క్రమంలో ఏ వర్గాన్ని కాదనుకున్నా ఎన్నికల సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదనే కోణంలో ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారు. కాగా 'పండుగకు ఇంకా సమయం ఉందిగా చూద్దాంలే' అంటూ కొందరు ప్రజా ప్రతినిధులు మాట దాటవేస్తున్నారు. మరికొందరు మాత్రం సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి తక్షణమే సిఫారసులు చేస్తున్నారు. కాగా ఎమ్మెల్యేల ప్రమేయం కూడా లేకుండా అధిక శాతం నాయకులు పందెం బరులను సిద్ధం చేస్తున్నారు. అందులో కొందరు ఉదయం నుంచి రాత్రి వరకు బరులు సాగిస్తుండగా, ఇంకొందరు రాత్రిళ్ల మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పలు గ్రామాల్లోనూ ఈ బరుల ఏర్పాట్లపై నాయకుల్లోనే ఒకరికొకరు వాగ్వా దాలకు కూడా దిగుతుండటం కొసమెరుపు. దీంతో ఇపుడు గ్రామ, మండల పార్టీ నాయకులకు ఆ బరుల నిర్వాహకుల నుంచి తల నొప్పులు మొదల య్యాయి. ఎవరికి మద్దతివ్వాలో, ఎవరికి సర్ది చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు.

పోలీసులతో ఒప్పందాలు

జిల్లా కేంద్రానికి అతి సమీపంలో బరులు వేస్తున్నా ఏ అధికారీ పట్టించు కోకపోవడంపై పలు విమర్శలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఆరా తీయగా పలువురు బరుల నిర్వాహకులు కొందరు స్టేషన్లలోని రైటర్లతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారన్న వార్త గుప్పుమంటోంది. ఈ క్రమంలో బరులు ఏర్పాటుచేస్తోన్న పరిధిలోని పోలీస్ స్టేషన్లలోని రైటర్లతో పలువురు నిర్వాహకులు ముందస్తు ఒప్పందాలు చేసుకునే ప్రయత్నాల్లో పడ్డారు. తమ తమ ప్రాంతాల్లో తామే పందేలు వేయిస్తున్నామని,వేరే వాళ్లకు అనుమతులు ఇవ్వవద్దని, ఆమ్యామ్యాలు సైతం అందిస్తామని హామీలు కూడా ఇస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతులు అందితే కచ్చితంగా సహకరిస్తామని, ఏయే ప్రాంతాల్లో ఎవరెవరికి సూచిస్తున్నారో పండుగ మూడు రోజుల బాధ్యత తాము తీసుకుంటామని కొందరు అధికారులు సైతం హామీ ఇస్తున్నట్లుగా భోగట్టా. అందువల్లే జిల్లాలో ప్రస్తుతం ప్రారంభమైన బరులపైనా అధికారులు ఎవరూ పెద్దగా స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్ సందేశాలతో

వాట్సప్, ఫేస్‌బుక్‌ల సాయంతోనూ ఈమధ్య బరులు కొనసాగిస్తున్నారు. వాట్సప్, ఫోన్ల ద్వారా సందేశాలు పంపుతూ ఏరోజు, ఎక్కడెక్కడ పందేలు జరుగుతున్నాయో సమచారం అందిస్తున్నారు. సంక్రాంతికి పది రోజులు ముందే ఈ ఆన్‌లైన్ కోడిపుంజులు రాత్రిపూట పోటికి సై అంటున్నాయి. కాలువ గట్టు, చేపల చెరువు గట్టు, బహిరంగంగా ఉన్న ఖాళీ ప్రదేశాలే అడ్డాగా జూదాలు నిర్వహిస్తున్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గ్రామాల్లో ఇప్పుడు పందేల వాతావరణం కనిపిస్తోంది. ప్రతీరోజూ పేకాట ఏ ప్రాంతాల్లో నిర్వహించేది వాట్సప్ మేసేజ్‌ల ద్వారా, ఫోన్ కాల్స్ ద్వారా రెండు గంటల ముందు సమాచారం అందిస్తున్నారు.పోలీసులకు తెలిసినా చూసీచూడకుండా వదిలివేస్తున్నారని, వేలల్లో ముడుపులు అందుకుంటున్నారని సమచారం. కొన్నిచోట్ల రోజు వారికి రూ.30 వేలు, మరికొన్నిచోట్ల రూ.5 నుంచి రూ.10 వేల వరకు బేరాలు కుదుర్చుకుంటున్నారని తెలుస్తోంది.

అక్కడ..అడుగడుగునా జూదాలు

కైకలూరు మండలం వరహాపట్నం, రాచపట్నం, భుజబలపట్నం, ఆటపాక, శ్యామలాంబపురం, దొడ్డిపట్ల, రామవరం, కొల్లేరు గ్రామమైన పందిరిపల్లి గూడెంలో ఈ జూదాలు జరుగుతున్నాయి. అలాగే ఆటపాక పక్షుల కేంద్రం సమీపాన ఉన్న ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో భారీగా పేకాట, కోడిపందాలు నిర్వహిస్తున్నారు. పక్షుల కేంద్రానికి ఆనుకొని ఉన్న పోల్‌రాజ్ డ్రైన్ కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నందున పందెపురాయళ్లు బైక్‌లను పక్షుల కేంద్రం గట్టుపై నిలుపుదల చేసి పడవలు దాటుకుంటూ వెళ్లిమరీ రాత్రిపగలు తేడా లేకుండా పేకాట, కోడిపందాలను నిర్వహిస్తున్నారు కైకలూరులో పోల్‌రాజ్ డ్రైన్ గట్టు వెంబడి పక్షుల కేంద్రం సమీపంలో తుమ్మ చెట్ల మధ్య పేకాట నిర్వహిస్తున్నారు. కొద్దిరోజులు అదే ప్రాంతానికి డ్రైన్ అవతలి వైపుకు పడవలపై వెళ్లి పేకాట ఆడుతున్నారు. ఆ ప్రాంతం ఏలూరు రూరల్ మండలం కావడంతో అక్కడి పోలీసులకు తెలిసి దాడులు నిర్వహించగా ఆ శిబిరాన్ని కైకలూరు వైపుకు మార్చి జూదం ఆడుతున్నారు. కైకలూరులో ఒక వార్డు సభ్యుడు ఆధ్వర్యంలో తమ చెరువుగట్టుపై నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని భారీ ఎత్తున కోత ఆటకు దారితీశారు. ఆటపాకలో చేపల చెరువుగట్ల వెంబడి, రైల్వేగేట్ అవతలి వైపున రాత్రిపూట భారీస్థాయిలో పేకాట నిర్వహిస్తున్నారు. ఉప్పుటేరు సమీపాన ఓ రాజుగారి చెరువుపై, వరహాపట్నంలోని చేపలచెరువు గట్టుపై ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడిపందాలు వేస్తున్నారు. పందిరిపల్లిగూడెంలో ఓ గ్రామపెద్ద ఆధ్వర్యంలో వేసే కోడిపందాలకు బరిలో రూ.2 నుండి రూ.5వేలు తీత తీస్తున్నారు. దీనిలో భారీగా పోలీసులు ముడుపులు అందుకుంటున్నట్లు సమా చారం. అలాగే కలిదిండి మండలంలో తాడినాడ, విభారమపురం, సున్నం పూడి, గుర్వాయిపాలెం, సానారుద్రవరం, సంతోషపురం, లోడిదలంక గ్రామాలో భారీగా నిర్వహించారు. పెదలంక గ్రామంలో డిసెంబరు 31, జనవరి 1వ తేదీన భారీ ఎత్తున కోడిపందాలను వేశారు. ముదినేపల్లి మండలం బొమ్మి నంపాడు, వైవాక, చేవూరు మండవల్లి మండలం భైరవ పట్నం, చింతపాడు, అయ్యవారిరుద్రవరం, కొవ్వాడలంక, లోకుముడి గ్రామాల్లో భారీఎత్తున పేకాట, కోడిపందాలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండగకు ముందే పెద్దఎత్తున జూదాలు నిర్వహిస్తే పండుగ రోజుల్లో ఇంకెలా ఉంటాయోనని ఊహాగానాలు వెలువడుతున్నాయి.

నిధుల దుర్వినియోగం అభియోగాలపై విచారణ

హైకోర్టు ఆదేశాలతో పెయ్యేరు పంచాయతీలో రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో చంద్రశేఖర్, ఇతర అధికారులు

ముదినేపల్లి, జనవరి 3: మండలంలోని పెయ్యేరు పంచాయతీలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలపై హైకోర్టు ఉత్తర్వుల మేరకు పంచాయతీ శాఖ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస విశ్వనాథ్.. పంచాయతీపై వచ్చిన 23 అంశాలకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ చేపట్టేందుకు ఎనిమిది మంది అధికారులు, సిబ్బందితో కూడిన కమిటీని ఈ నెల రెండున నియమించారు. అదే గ్రామానికి చెందిన వల్లూరిపల్లి రామకృష్ణారావు గత ఏడాది డిసెంబరు 11న హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్న ఫిర్యాదులపై విచారణ నిర్వహించి ఈ నెల నాలుగులోగా నివేదిక అందజేయాలని డీపీవో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం బుధవారం డీఎల్‌పీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది విచారణ చేపట్టారు. 2018 నుంచి ఆ పంచాయతీలో పరిపాలన, ఆర్థిక పరమైన అంశాలు, నిధుల దుర్వినియోగం, ఆదాయం ఖర్చులు, బైటా ఆచరణ, నీటి కుళాయిల మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము తదితర అంశాలకు సంబంధించి ఫిర్యాదుదారులు రామకృష్ణారావు, రెడ్డి వెంకటేశ్వరరావు హైకోర్టులో పిటిషన్ వేయటమే కాక, స్పందనలో చేసిన ఫిర్యాదులపై విచారణ నిర్వహిస్తున్నారు. నీటి కుళాయిల మంజూరుకు పంచాయతీ వసూలు చేసిన సొమ్ముకు సంబంధించిన అంశాలపై అలేఖ్య విల్లాస్‌లో విచారణ చేపట్టారు. నీటి కుళాయిలకు సంబంధించి ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల కంట్రిబ్యూషన్‌ను వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. నివేదికలను ఈనెల 4లోగా డీపీవోకు, ఐదులోగా కలెక్టర్‌కు, ఆరున హైకోర్టుకు సమర్పించాల్సి ఉంది.

విచారణలో ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి ఈవోపీఆర్డీలు లక్ష్మీనారాయణ, రాజారావు, ఏలూరు జిల్లా చాటపర్రు, నాయుడుగూడెం, సూరప్పగూడెం, ఏపూరు, పెదపాడు, వడాలి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. పెయ్యేరు పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్ నుంచి డీఎల్‌పీవో వివరాలు సేకరించారు. మాజీ సర్పంచ్ బొడ్డు మోహనరావు, ఫిర్యాదుదారు రెడ్డి వెంకటేశ్వరరావు.. పంచాయతీపై చేసిన అభియోగాలపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు



ముదినేపల్లి, జనవరి 3 : మండలంలో పలు వైష్ణవాలయాల్లో బుధవారం ధనుర్మాస పూజలు వైభవంగా జరిగాయి. పెదగొన్నూరు రజకవాడ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు సహస్ర దీపారాధనలు నిర్వహించారు. అర్చకుడు లంక వెంకటేశ్వరబాబు స్వామివార్లకు అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పెందుర్తి బసవయ్య లక్ష్మీపురపు సుబ్బారావు పర్య వేక్షించారు. సీతారామస్వామి దేవస్థానంలో గోదాదేవికి పూజలు నిర్వహించారు. ముదినేపల్లి పెదరామాలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

జగన్నాథస్వామికి లక్ష తులసి..



ముదినేపల్లి రూరల్, జనవరి 3: వాడాలి జగ న్నాథస్వామి దేవస్థానంలో వారం రోజులుగా ధను ర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. భవానీలు బుధవారం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారికి లక్ష తులసి పూజ నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

దీక్ష విరమణకు బెజవాడ బయలుదేరిన భవానీలు

ముదినేపల్లి, జనవరి 3 : భవానీ మాలధారుల దీక్షల ముగింపును పురస్కరించుకుని బొమ్మినంపాడు రామాలయంలో బుధవారం ఇరుము ళ్ల కార్యక్రమం నిర్వహించారు. మాల ధారులు గురుస్వామితో ఇరుముళ్లు కట్టించుకుని విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానానికి బయలుదేరి వెళ్లారు. లావేటి వీరశివాజీ పూజలు జరిపారు.



కైకలూరులో సావిత్రిబాయికి నివాళులర్పించిన అధ్యాపకులు

సావిత్రిభాయి పూలేకు ఘన నివాళి

కలిదిండి, జనవరి 3 : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సావిత్రిభాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎంఈవో ప్రభాకర్ బాబు, ఎంపీడీవో దినతేజ్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన సావిత్రిభాయి పూలేను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. దేశంలో మొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టి మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు.

● కైకలూరు: వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిభాయిపూలే చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ బి. ఉదయప్రకాష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పూలే కులమతాలకు అతీతంగా బాలికా విద్య కోసం ఎంతగానో పోరాడారన్నారు. జాలబాబు, హరిప్రసాద్, ఇమ్మానియేలు, జ్ఞాన ప్రసూనాంబ, సంధ్య, సుగుణ, నల్లూరి శ్రీనివాస్, శివనాగరాజు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న మహిళా మండలి

ప్రారంభోత్సవానికి రండి..

» మహిళా సమాఖ్య ఆహ్వానం.. 6న నూజివీడులో మహిళా మార్ట్..

ఏలూరు కలెక్టరేట్/ నూజివీడు, జనవరి 3: ఏలూరు జిల్లా నూజివీడు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 6న నూజివీడులో కొత్తగా ప్రారంభించే వైఎ స్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తూ మండల మహిళా సమాఖ్య పాలకవర్గ, జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యులు బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు ఆహ్వానపత్రికను అందజేశారు. 62 గ్రామ సంఘాల్లోని 18,643 సభ్యులు ఒక్కొక్కరు రూ.200 వాటా ధనంతో రూ.36 లక్షల పెట్టుబడితో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు పాల్గొన్నారు.

సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం

ముదినేపల్లి, జనవరి 3 : సామాజిక భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. పెన్షన్లు, ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్ కార్డులను స్థానిక మండల కార్యాలయం వద్ద బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రామిశెట్టి సత్యనారాయణ, ఈడే వెంకటేశ్వరమ్మ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశ్వరి, గంటా సంధ్య, నిమ్మగడ్డ కైకమ్మ, సుశీల, శీలం రామకృష్ణ, ఏసుబాబు, పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీ

నూజివీడు టౌన్, జనవరి 3: ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం పెంచిన పింఛన్‌లను ఎమ్మెల్యే ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు లాంఛనంగా పంపిణీ చేశారు. అమ్మఒడి, విద్యాకానుక, వసతిదీవెన, ఆసరా ఇలా.. అనేక పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా పింఛన్‌దారులకు నెలకు రూ.3వేలు అందిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ గుడిమెళ్ళ కృష్ణంరాజు, శిరీష, ఎంపీడీవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలను తప్పుదోవపట్టిస్తున్న జగన్'

ముసునూరు, జనవరి 3: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తు న్న పథకాలను జగన్ తప్పు దోవపట్టిస్తూ కమీషన్ సీఎం అయ్యారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ జి.ఆర్.కె. రంగరావు ఆరోపించారు. గోపవరం, కాట్రేనిపాడు గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. రంగరావు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మోదీ వేలాది కోట్ల నిధులను ఇస్తుంటే, సీఎం జగన్ మాత్రం దారిమళ్లిస్తున్నారని విమర్శించారు. కేంద్ర పథకాలను జిల్లా సెక్రటరీ మాగంటి వాసు వివరించారు. ఆముదాల ఇసాక్, అనగాని రాంబాబు, కంచర్ల రాంబాబు, ఎంపీడీవో జి.రాణి, ఏవో ఎస్.మధుమోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఆగిరిపల్లి, జనవరి 3: వట్టిగుడిపాడు ఎంపీపీ పాఠశాలలో బుధవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని హెచ్‌ఎం పార్వతి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు హాజరయ్యారు. కలపాల ప్రకాష్, పిన్నిబోయిన వీరబాబు, ఆర్‌సీఎమ్ పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం టి.పావనీజ్యోతి సుజనాకుమారి తదితరులు సావిత్రిభాయ్ పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించండి

» కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న చలసాని వెంకట రామారావు

నూజివీడు టౌన్, జనవరి 3: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనదీక్ష బుధవారం కొనసాగింది. ఏఐటీయూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు మాట్లాడుతూ,సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. పుల్లారావు, డి.రవికుమార్, విజయ, ఎస్.శ్యామల, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన అంగన్‌వాడీలు

ముదినేపల్లి, జనవరి 3 : నిరవధిక సమ్మెలో భాగంగా యూనియన్ పిలుపు మేరకు మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు బుధవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమానికి ఏలూరు తరలివెళ్లారు. సూరపనేని అరుణ కుమారి, సొంగా మణి, బండి పద్మ, రిబ్కా నాయకత్వంలో సుమారు 160 మంది ఏలూరు వెళ్లి కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్నారు. తొలుత నిరసన దీక్షా శిబిరం వద్ద మాట్లాడారు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదన్నారు.

● కైకలూరు: ఏలూరులోని కలెక్టర్ కార్యాలయ ముట్టడికి మండలం నుంచి పెద్దఎత్తున మహిళలు బస్సులు, ఆటోల్లో వెళ్లారు.

● కలిదిండి: సమస్యల పరిష్కారం కోసం 23 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు కలిదిండి నుంచి కలెక్టరేట్ ముట్టడికి ఏలూరు తరలివెళ్లారు. అబిదాబేగం, రమాదేవి, మేనకలక్ష్మి, స్నేహపుష్ప, ప్రమీల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్టీయు మండల అధ్యక్షుడిగా వెదుళ్ళ



వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు

చాట్రాయి, డిసెంబరు 3: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయు) మండల అధ్యక్షుడిగా వెదుళ్ళ వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడుగా డి.నాగేశ్వరరావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్యామ్యూల్ తెలిపారు. చాట్రాయిలో బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా భరత్ దివ్యకాంత్, జిల్లా కౌన్సిలర్స్‌గా జి.రాము, జి.అమరయ్య, ఎస్‌కె మహబు, ఎస్. రాము ఎన్నికైనట్లు ప్రకటించారు.

చింతమనేనికి జన్మదిన శుభాకాంక్షలు..



చింతమనేనికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

చాట్రాయి, డిసెంబరు 3: మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుట్టిన రోజు సందర్భంగా మండలం నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు దుగ్గిరాల వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, కందుల కృష్ణ, చెన్నారావు, పానుగళ్ళ కోటేశ్వరరావు, కంచర్ల హనుమంతరావు, బొర్రా నాగేశ్వరరావు ఉన్నారు.

పాఠశాలల్లో కబడ్డీ పోటీలు

చాట్రాయి, డిసెంబరు 3: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మర్లపాలెం, చనుబండ, చిత్తపూరు, చిన్నంపేట హైస్కూల్స్ ఆవరణలలో బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, ప్రభాకరరావు, విజయ్, వెంకట్ పోటీలు పర్యవేక్షించారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే చర్యలు

కలిదిండి, జనవ రి 3 : సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలో కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దశిక వంశీ హెచ్చరించారు. ఈ నెల 18 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అనధికార మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు రమణక్కపేటలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

ముసునూరు, జనవరి 3: రమణక్కపేటలో గురువారం అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర తెలిపారు. టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరావు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఉచితంగా కళ్లజోళ్లతోపాటు కంటి ఆపరేషన్‌లను చేయడం జరుగుతుందని రవీంద్ర తెలిపారు.

బాలికల హాస్టల్ ప్రహరీ నిర్మాణానికి చర్యలు



ప్రహరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కలిదిండి, జనవరి 3 : ఎస్సీ బాలికల హాస్టల్ ప్రహరీనిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. 'బాలికల హాస్టల్‌కు ఇదేనా రక్షణ' అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కోరుకొల్లు ఎస్సీ బాలికల హాస్టల్‌ను బుధవారం సందర్శించారు. ప్రహరీ నిర్మాణంతోపాటు మౌలిక వసతులకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎంఈవో ప్రభాకర్‌బాబు పాల్గొన్నారు.